ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 19 సెప్టెంబరు 2024

ప్రభుత్వ విప్ జన్మదిన వేడుకలు 8
విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి 8

ఆరోగ్య బీమా వృద్ధులకు ధీమా





- 70 ఏళ్ల పైబడిన వారికి పీఎంజేఏవై
- జిల్లాలో 40 వేల మంది వృద్ధులకు ప్రయోజనం
- అవగాహన కల్పిస్తేనే ఉపయోగం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పేదలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వాలు ప్రత్యే క దృష్టిసారిస్తున్నాయి. ప్రధానంగా ప్రజావైద్యానికి పెద్దపీట వేస్తున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఆరోగ్యబీమా తీసుకొచ్చింది. పేద, ధనిక తార తమ్యం లేకుండా రూ. 5 లక్షల వరకు ఉచితంగా ఆరోగ్యబీమా సౌకర్యాన్ని కల్పించింది. 70 ఏళ్ల పైబడిన వృద్ధుల కోసం ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రైవేటు ఆరో బీమాలో ఉన్నవారు కూడా ఈ పథకాన్ని వినియో గించుకునే అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం హెల్త్‌స్కీం, సీజీహెచ్ఎస్, ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రీబ్యూటరీ వంటి ఇతర పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న వారు పథకాన్ని సద్వి నియోగం చేసుకోవచ్చు. లేదా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కొనసాగించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలు పొందే వారు వాటితో సంబంధం లేకుండా ఈ పథకం పొంద వచ్చు. మరోవైపు 2018 నుంచి అమలు వుతున్న ఆయుష్మాన్ భారత్ పథకంలో ఇప్పటికే జిల్లాలోని పలువురు నమోదు అయ్యారు.

జిల్లాలో 70 ఏళ్ల వయస్సు పైబడిన పింఛన్‌దారులు


మండలం	వృద్ధులు
బోయినపల్లి	896
చందుర్తి	805
ఇల్లంతకుంట	1260
గంభీరావుపేట	913
కోనరావుపేట	926
ముస్తాబాద్	1013
రుద్రంగి	340
సిరిసిల్ల	1311
తంగళ్లపల్లి	1063
వీర్నపల్లి	243
వేములవాడ	229
వేములవాడ మున్సిపల్	561
ఎల్లారెడ్డిపేట	1023
మొత్తం	11,106

● వృద్ధులకు ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధాన మంత్రి జన్‌ఆరోగ్య యోజన పథకంలో జిలాలో 70 ఏళ్ల పైబడిన దాదాపు 40 వేల మందికి లబ్ధి చేకూరనుంది. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ ఓటరు జాబితా ప్రకారం 35 వేల మంది వృద్ధులు ఉండగా పెన్షన్ పొందుతున్న వారిలో 70 ఏళ్ల పైబడిన వారు 11,106 మంది ఉన్నారు. ప్రస్తుతం మారిన జీవనశైలి ప్రకారం అనేక మంది మానసిక ఒత్తిళ్ల, డయాబెటిక్, బీపీ, కిడ్నీలు, లివర్, గుండె సంబంధిత, పెరాలసిస్, న్యూరో, మోకాళ్ల, కీళ్ల నొప్పులు వంటి అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. మెరుగైన వైద్యసహాయాన్ని పొందలేక పోతున్నారు. ప్రైవేటు ఆరోగ్య బీమా సంస్థలు కూడా 70 ఏళ్ల పైబడిన వారికి బీమా పాలసీలు ఇస్తున్నా ప్రీమియం అధికంగా ఉండడంతో మొగ్గు చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో వృద్ధులు కార్పొరేట్ వైద్యం పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కూడా రూ 10 లక్షల వరకు సౌకర్యంకల్పించింది. ఇప్పుడు కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకం మరింత భరోసాను ఇవ్వనుంది.

● అవగాహన అవసరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్, జన్ యోజన పథకాలపై అవగాహన కల్పిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. 70 ఏళ్ల పైబడిన వారందరికీ ఈ పథకం వర్తిస్తున్న నేపథ్యంలో దరఖాస్తు చేసుకునే విధానం, బీమా పొందే వీలు ఏ ఆస్పత్రుల్లో, ఏ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయనే విషయాలపై వృద్ధులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనకరంగా ఉండనుంది.



గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


పోషణ మాసంలో పాల్గొన్న జిల్లా సంక్షేమ అధికారి

వీర్నపల్లి, సెప్టెంబర్ 18 : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు సమతుల్య పౌష్టికాహారాన్ని తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అన్నారు. వీర్నపల్లి మండల సెక్టార్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. గర్జనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని పరిశీలించారు. హెల్త్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకాలు కలిగిన ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వుపదార్థాలు, ఖనిజలవణాలు, పీచుపదార్థాలు, రోగనిరోధక శక్తికి పెంపొందిస్తాయన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని మొదటి సెంటర్‌లో పదవి విరమణ పొందుతున్న చిన్నం గంగమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిని, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, రమాదేవి, మంజుల, ఏఎన్ఎంలు మంజుల పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 18 : ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లా డారు. గ్రామాల్లో నివాసం ఉంటున్న కుటుంబంలోని సభ్యులందరి ఓట్లు ఒకే వార్డుకు వచ్చేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ నెల 28వ తేదీన గ్రామాల్లో వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను ప్రచురణ చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు ప్రజలు సహకరిం చాలన్నారు. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఈ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 13న గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు చెప్పారు. జిల్లాలో ఉన్న 260 గ్రామ పంచాయతీల పరిధిలోని 2268 వార్డుల్లో మొత్తం 3లక్షల 46వేల 220 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేశామన్నారు. ఇందులో అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను ఈ నెల 21లోగా సంబంధిత ఎంపీడీవోలకు లిఖిత పూర్వకంగా సమర్పించాలన్నారు. ఈ నెల 26లోపు అభ్యంతరాలను పరిష్కరించి 28న తుది జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. గ్రామీణ ఓటరు జాబితా పకడ్బందీగా తయారు చేసేందుకు పార్టీల ప్రతినిధులు సహకారం అందజేయాలన్నారు. ఓటర్ జాబితా రూపకల్పనపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తంగళ్లపల్లి కేసీఆర్‌నగర్‌లో అధిక జనాభా ఓటర్లు ఉన్నందున దానిని ప్రత్యేక గ్రామపంచాయతీచేసి ప్రతిపాదనను పరిశీలించాలని రాజకీయ పార్టీల తరఫున కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో గీతాలతోపాటు రాజకీయ పార్టీలకు చెందిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తంగళ్ల పల్లి మండల అధ్యక్షుడు గంజభీంకార్ రాజన్న, సీపీఎం నాయకులు ఎరవెళ్లి నాగరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, టీడీపీ నాయకుడు తీగల శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

బై..బై గణేషా

- రెండో రోజు కొనసాగిన శోభాయాత్ర
- ముగిసిన వినాయక నిమజ్జనోత్సవం
- పరిశీలించిన ఎస్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్


సిరిసిల్ల మానేరు వాగులో నిమజ్జనం

సిరిసిల్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనం బుధవారం కూడా కొనసాగింది. జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో 600కు పైగా భారీ వినాయకులను ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి మొదలైన నిమజ్జనోత్సవం బుధవారం మధ్యాహ్నం ముగిసింది. ఎస్పీ అఖిల్‌మహాజన్ పర్యవేక్షణలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, కమిషనర్ పసహాత్ అలీబేగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేస్తూ ప్రశాంతంగా నిమజ్జనం కొనసాగే విధంగా సూచనలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు ఉన్నారు.

నిమజ్జనోత్సవాన్ని పరిశీలించిన ఎస్పీ

సిరిసిల్ల మానేరు తీరంలో నిమజ్జనోత్సవాన్ని బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. నిమజ్జనం విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన జిల్లా ప్రజలకు, మండపాల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, సిబ్బందిని అభినందించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, సర్వర్, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.


సిరిసిల్లలో శోభాయాత్ర

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం బుధవారం కొనసాగింది. కుల సంఘాలు, యూత్ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిమజ్జనం శోభాయాత్ర ప్రారంభించగా బుధవారం సాయంత్రం వరకు కొనసాగాయి.




సిరిసిల్లలో రెండో రోజు శోభాయాత్ర


పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

రాజన్నను దర్శించుకున్న విప్ ఆది శ్రీనివాస్


స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 18 : వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం రాజరాజేశ్వర స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఉద్యోగులు, అర్చకుల ఆధ్వర్యంలో విప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి నేతృత్వంలో రాజన్న ఆలయ పరిసరాల్లోని యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాత సత్యలక్ష్మి, కనికరపు రాకేష్ తదితరులు ఉన్నారు.

నేడు బండి సంజయ్ రాక

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 18: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ గురువారం ఎల్లారెడ్డిపేట మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించనున్నారు. పాఠశాలలోని వసతులు, సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 18: జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో సిరిసిల్ల రైసింగ్ ఫిట్టెస్, స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు బుధవారం అకాడమి కోచ్‌లు కృష్ణహరి, సాయితేజ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచిన కమటం జిగీష, బొల్లి రుత్విక, కంచర్ల నరేంద్రవర్మ, ఊసకోయాలా అఖిల్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 23వరకు సిరిసిల్ల పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో సిరిసిల్ల క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అకాడమీ సభ్యులు, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌లో క్లాత్ ఫోల్డింగ్ మిషన్ ప్రదర్శన


మిషన్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 18: మరమగ్గాలపై తయారు చేసిన వస్త్రం ఫోల్డింగ్ మిషన్‌ను ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మానిక్‌లో మిషన్‌ను ప్రదర్శించారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమరామయ్య బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన హేమంత్ అనే విద్యార్థి, గైడ్ టీచర్ పాకాల శంకర్‌గౌడ్ సహకారంతో తయారు చేసిన క్లాత్ ఫోల్డింగ్ మిషన్ జాతీయ స్థాయికి ఎంపికైంది. మంగళవారం నుంచి ఢిల్లీలోని ప్రగతి మైదానంలో ప్రారంభమైన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మానిక్ గురువారం వరకు నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు 875 సైన్స్ ఎగ్జిబిట్లు ప్రదర్శించగా తెలంగాణ రాష్ట్రం నుంచి 24 ఉన్నాయి. ఇందులో సిరిసిల్లకు చెందిన జక్కని హేమంత్ రూపొందించిన మరమగ్గాల క్లాత్ ఫోల్డింగ్ మిషన్‌ను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ఆర్టీ అధికారులు రమేష్‌రావు, సురేందర్, వేణు, శారద, శైలజ, లక్ష్మీ, అజయ్ పాల్గొన్నారు.

ఇనుపరాడ్లను దొంగిలించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు

మానకొండూర్, సెప్టెంబరు 18 : మానకొండూర్ చెరువులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల ఇనుపరాడ్లను చోరీ చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి జున్నూతుల రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఇందిరానగర్ వద్ద ఒకే రోజు మూడు ప్రమాదాలు

● వరుస ప్రమాదాలతో జనం ఆందోళన



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులు

తిమ్మాపూర్, సెప్టెంబరు18: మండలంలోని ఇందిరానగర్ గ్రామం రాజీవ్ రహదారిపై బుధవారం ఒకే రోజు గంటల వ్యవధిలో మూడు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌కి చెందిన అలువాల శంకర్ తన ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఇందిరానగర్ వద్ద రోడ్డు దాటుతుండగా నుస్తులాపూర్ వైపు నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొని వాహనాలపై ఉన్న ముగ్గురు ఎగిరి పడ్డారు. ఇందులో అలువాల శంకర్‌కు కాలు విరగగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అదే స్థలంలో మరో గంట వ్యవధిలోపల మరో రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందిరానగర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎలుక బాలయ్య తన ద్విచక్ర వాహనంపై ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారి దాటుతుండగా హైదారాబాద్ వైపు నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొని తప్పించుకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఎలుక బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మూడవ రోడ్డు ప్రమాదం రాత్రి 9గంటల సమయంలో చోటుచేసుకుంది. బీహార్‌కి చెందిన బోధ్ అనే వ్యక్తి ఇందిరానగర్ వద్ద రోడ్డు దాటుతుండగా ఓ కారు అతివేగంగా ఢీకొనడంతో బోధ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 10 రోజులుగా ఇందిరానగర్ గ్రామ స్టేజీ రాజీవ్ రహదారిపై 8 రోడ్డు ప్రమాదాలు సంబవించగా 9మంది గాయపడ్డారు.

క్వారీ తవ్వకాలను నిలిపివేయాలి


క్వారీ వద్ద నిరసన తెలుపుతున్న గొర్రెల కాపర్లు

గన్నేరువరం, సెప్టెంబర్ 18: మండలంలోని హన్మాజిపల్లి గ్రామశివారులో ఉన్న బోడగుట్టపై ప్రారంభించిన గ్రానైట్ క్వారీ పనులను వెంటనే నిలిపివేయాలని గొర్లు మేకల పెంపకందారుల జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని గొర్లకాపరులతో కలిసి క్వారీ నిర్వహిస్తున్న బోడగుట్టను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ నిర్వహణతో జీవాల మేతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గ్రామంలో గొర్ల పెంపకం వృత్తి మీద ఆధారపడి ఉన్న 40 కుటుంబాలు గుట్టకు జీవాలను మేపుతూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. బ్లాస్టింగ్‌ల శబ్దానికి గుట్టను ఆవాసంగా చేసుకొని నివసిస్తున్న వన్యప్రాణులు గ్రామంలోకి వస్తున్నాయని అన్నారు. బ్లాస్టింగ్‌లతో సమీపంలోని గ్రామాలలో ఇండ్లు బీటలు వారే ప్రమాదం ఉందన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి క్వారీ పనులను నిలిపివేసేందుకు అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ మండల నాయకులు తమ్మనవేణి శ్రీనివాస్, దాడి మహేందర్, కేశవేణి శ్రావణ్, రాజయ్య, రవి, పురుషోత్తం, పర్శరాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సహకార సంఘంలో అవకతవకలపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

వీణవంక, సెప్టెంబర్ 18: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవతవకలు జరిగాయని విశ్రాంత ఉద్యోగి ముదిగంటి రఘునాథరెడ్డి ఫిర్యాదు మేరకు బుధవారం జిల్లా సహాయ రిజిస్ట్రార్ కరణ్‌కుమార్ విచారణ చేపట్టారు. సహకార సంఘంలో 2016 నుంచి 2020 వరకు కొనుగోలు కేంద్రాలలోకి వచ్చిన గోనె సంచుల్లో అవకతవకలు జరుగడంతో సంఘానికి వచ్చే రూ.37 లక్షలు తీసుకున్నారని, సంఘానికి నష్టం వాటిల్లిందని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా సహాయ రిజిస్ట్రార్ కరణ్‌కుమార్ సహకార సంఘంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో పాటు సంఘం సిబ్బందిని విచారించారు. విచారణ అధికారి మాట్లాడుతూ సంచుల్లో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదుతో విచారణ జరుపుతున్నామని విచారణ పూర్తి చేసి జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

3 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 18 : తెలంగాణ ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబరు 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు 16 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సంబంధిత అధ్యయన కేంద్రానికి వెళ్లి హాల్‌టికెట్స్ తీసుకోవాలన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు 18: గురుకుల ఉపాధ్యా యుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ టిగ్రీస్ రాష్ట్ర కార్యదర్శి భూపేందర్‌కౌర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గురుకుల యాజమాన్యాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సి పాల్స్, జెఎల్స్, డిగ్రీ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఈనెల 28న హైదరాబా ద్‌లో జరిగే మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల పెంపు



కాకతీయ కాలువ ద్వారా దిగువకు భారీగా ప్రవహిస్తున్న నీరు

తిమ్మాపూర్, సెప్టెంబరు18 : కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు నీటి విడుదలను బుధవారం ఇరిగేషన్ అధికారులు పెంచారు. కాకతీయ కాలువ నుంచి దిగువకు 500క్యూసెక్కుల నీరు విడుదల చేసిన అధికారులు సోమవారం 3వేల క్యూసెక్కులకు పెంచారు. తిరిగి బుధవారం ఉదయం 8గంటల సమయంలో మరో వెయ్యి క్యూసెక్కులు పెంచి ప్రస్తుతం 4వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండి పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం ఎల్‌ఎండిలో 23.689 టీఎంసిల నీరు నిల్వ ఉంది.

డీజే నిర్వాహకులపై కేసు నమోదు

మంథని, సెప్టెంబర్ 18: నిబంధనలు ఉల్లంఘించి వినాయక నిమజ్జనంలో డీజేలు ఏర్పాటు చేసిన కాకర్ల పల్లికి చెందిన అర్విండ్, కైర్‌తోపాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బుధవారం తెలిపారు. మంగళవారం నిమజ్జనం సందర్భంగా వారు నిబంధనలు ఉల్లంఘించినందుకు వారిపై కేసు నమోదు చేశామన్నారు.

శిశుమందిరాలతో సంస్కృతి పరిరక్షణ

● నేనూ శిశుమందిర్ విద్యార్థినే ● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

జమ్మికుంట, సెప్టెంబర్ 18 : శిశుమందిరాలు భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందిస్తూ విద్యను అందిస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో రూ. 1.30 కోట్ల వ్యయంతో నిర్మించిన బాలికల వసతిగృహం భవనాన్ని బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతో పాటు తమ అన్నయ్యలు, అక్కయ్య కూడా శిశుమందిర్‌లోనే చదువుకున్నారని అన్నారు. జమ్మికుంట శిశుమందిర్ పూర్తిస్థాయిలో రెసిడెన్షియల్ పాఠశాలగా మారడం సంతోషంగా ఉందని అన్నారు. శిశు మందిర్‌లకు నిధులెందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్ యుగంలో విదేశీ విచ్చలవిడి సంస్కృతి కొనసాగు తున్న ఈ రోజుల్లో శిశుమందిరాలు ఎదుగుతూ నిలబడుతుండటం గొప్ప విషయం అన్నారు. కోరుట్ల, జగిత్యాల, సిరిసిల్ల, ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి చదువుకుంటున్నారన్నారు. శిశు మందిరాల్లో చదువుకున్న వారు ఏ రంగంలో ఉన్నా జాతీయవాద భావజాలంతో పని చేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజనం బాధ్యత కూడా ప్రధానోపాధ్యాయులపైనే పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. శిశుమందిరాలకు ప్రభుత్వం నుంచి సహకారం లేదన్నారు. చీపురుపుల్లతో కూడా ఏకే-47లు తయారు చేసేంతటి శిక్షణ ఇస్తూ ఉగ్రవాదాన్ని పెంచిపోషి స్తున్న మదర్సాలకు ప్రభుత్వాలు నిధులు ఎందుకు ఇస్తున్నాయన్నారు.

● తుమ్మేటి కుటుంబ సభ్యులకు పరామర్శ

ఇటీవల మృతిచెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. తుమ్మేటి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో శ్రీసరస్వతి విద్యాపీఠం దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, తహసీల్దార్ రమేష్, తేలే రాజమౌళి, డాక్టర్ చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పచ్చిక శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ వేముల రఘుపతిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజయ్య, జీడి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో ఐదవ ర్యాంక్

● జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్



పాత మున్సిపల్ కార్యాలయంలో చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జమ్మికుంట, సెప్టెంబర్ 18: తెలంగాణ రాష్ట్రంలో ఇంటి పన్నుల వసూళ్లలో జమ్మికుంట మున్సిపాలిటీ ఐదవ ర్యాంక్ సాధించిందని మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మహిళ సంఘం సభ్యులకు తడి, పొడి చెత్తపై కమిషనర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో చెత్త సేకరణలో కూడా మంచి ర్యాంక్ సాధించే దిశగా ముందుకు వెళ్తామన్నారు. మున్సిపల్ పరిధిలో మొత్తం 17వాహనాలు చెత్త సేకరించేందుకు తిరుగుతున్నాయన్నారు. చెత్త బండ్లు ఇంటి ముందుకు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రావికంటి రాజు, హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, సీఎల్ఆర్పీలు, ఆర్పీలు, సంఘం సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్



గోదావరి నదిలోనికి ట్రాక్టర్లు దిగకుండ కందకాన్ని తోడుతున్న జేసీబీ

బీర్‌పూర్, సెప్టెంబరు 18 : అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్‌చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. తహసీల్దార్ ముంతాజుద్దీన్ ఆధ్వర్యంలో గోదావరి నది పరివాహక ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో చిన్న కొల్వాయి గ్రామం సమీపంలోని గోదావరి ఒడ్డున అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులు ఉండడంతో మైనింగ్ అధికారులకు సమాచారం అందించి ఇసుక డంపులను సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సుమారు 75 ట్రాక్టర్ ట్రిప్పుల వరకు ఉన్నట్లు అంచనా వేశారు. ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు. గోదావరి నదిలోనికి ట్రాక్టర్లు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా కందకాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం మైనింగ్ ఏడీ జైసింగ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ట్రాక్టర్ యజమానులు గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే మొదటిసారిగా 25,000 వేల రూపాయలు, రెండోసారి 50,000వేల రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. మూడోసారి పట్టుబడితే ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కొంతమంది ట్రాక్టర్ యజమానులు వ్యవసాయ అనుమతులతో ఉన్న ట్రాక్టర్లను అక్రమంగా ఇసుక తరలించడానికి ఉపయోగిస్తున్నారని ఇది సరైనా పద్ధతి కాదని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ అధికారులు, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి శిబిరంలో ఎన్‌సీసీ కెడెట్ల ప్రతిభ



ఎన్‌సిసి శిబిరంలో ప్రతిభ చాటిన ఎన్‌సిసి కెడెట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 18: నైన్ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కెడెట్లు జాతీయ స్థాయిలో న్యూఢిల్లీలో జరిగిన తలసైనిక్ శిక్షణ శిబిరంలో పాల్గొని విశేష ప్రతిభ చాటారు. కరీంనగర్ నుంచి జి.అభిషేక్, కె.హన్సికలు బంగారు పతకాలను సాధించారని కమాండింగ్ అధికారి కల్నల్ డెనియల్ లాట్‌జం తెలిపారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ఎన్‌సిసి కెడెట్ల నుంచి నైన్ టి బెటాలియన్ కెడెట్లు విశేష ప్రతిభ చాటి మ్యాప్ రీడింగ్‌లో జి అభిషేక్ (ఎస్ఆర్ఆర్ కళాశాల) ఫైరింగ్ విభాగంలో కె హన్సిక (సెయింట్ జార్జ్ పాఠశాల) కెడెట్లు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వారిని ఎన్‌సిసి బెటాలియన్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ, చంద్రశేఖర్ ఎన్‌సిసి అధికారి కెప్టెన్ రేండ్ల సంజీవ్ సుబేదార్ మేజర్ సూర్యప్రసాద్, బి రజిత, తదతితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

కోరుట్ల, సెప్టెంబరు 18 : మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో కోరుట్ల పట్టణంలోని టీజీఎంఆర్ఎస్ కోరుట్ల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శంకర్ బుధవారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విష్ణువర్ధన్, ఎండీ అయాన్ 60 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపియినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. క్రీడలలో రాణించిన విద్యార్థులతో పాటు పీఈటీలు సంజయ్, రాజేష్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు.

● గురుకుల విద్యార్థులు..

పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీలలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ బండి బాబు బుధవారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మధు 200 మీటర్లు, రిశ్వంత్ 1000 మీటర్ల పరుగు పందెంలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై విద్యార్థులతో పాటు పీడీ, పీఈటీలు అజయ్, జగన్‌లను ప్రిన్సిపల్ బండి బాబు, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ అభినందించారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

ట్రాక్టర్ కిందపడి యువకుడి దుర్మరణం



రాకేశ్‌రెడ్డి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 18: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో వినాయక నిమజ్జనోత్సవంలో బుధవారం రాత్రి అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి న్యాలకొండ రాకేష్‌రెడ్డి(18) అనే యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. దుమాలకు చెందిన రాకేష్‌రెడ్డి ఇంటర్ వరకు పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. తోటి స్నేహితులతో కలిసి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బుధవారం రాత్రి నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. ట్రాక్టర్‌ను ఆన్ చేసి వాహనంలో డీజిల్ పోసేందుకు మూత తీస్తున్న క్రమంలో గేర్ పడి ఒక్కసారిగా వాహనం ముందుకు వెళ్లింది. దీంతో ట్రాక్టర్ కింద పడిన రాకేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించే లోపు రాకేశ్‌రెడ్డి చనిపోయాడు. యువకుడి తండ్రి రఘుపతి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వలస వెళ్లాడు. ఒక్కాగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లి మాధవి, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 18 : కరీంనగర్ రాంచంద్రాపూర్ కాలనీకి చెందిన మంచె ప్రకాశ్ ఈనెల 14న కుటుంబంతో ఊరికి వెళ్ళగా దొంగలు ఇంటి తాళం పగులగొట్టి 3 తులాల బంగారం, ఇతర వెండి వస్తువులు ఎత్తుకుపోయారు. ప్రకాశ్ బుధవారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని ఆభరణాలు కనపడలేదు. బాధితుడు కరీంనగర్ ఒక టౌ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

మహిళకు ఏడాది జైలు శిక్ష

సిరిసిల్లక్రైం, సెప్టెంబరు 18 : కరీంనగర్‌కు చెందిన కిన్నెర మల్లవ్వ అనే మహిళకు ఏడాది జైలు శిక్ష విధి స్తూ బుధవారం సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించారని సిరిసిల్ల డీఎస్పీ చంద్ర శేఖర్‌రెడ్డి తెలిపారు. ఇల్లంతకుంట మండలంలోని జంగారెడ్డిపల్లెకు చెందిన వొల్లాల మల్లయ్య వద్ద కిన్నెర మల్లవ్వ 2017లో రూ.4.30 లక్షలు అప్పు తీసు కుంది. తిరిగి అతడి కూతురు వివాహానికి ఇస్తానని చెప్పింది. 2018లో మల్లయ్య తన కూతురి వివాహం కోసం మల్లవ్వను డబ్బులు అడిగాడు. ఇవ్వక పోవ డమే కాకుండా బెదిరింపులకు పాల్పడింది. తన కూతురు వివాహం ఆగిపోతుందని మనోవేదనకు గురైన మల్లయ్య 19 ఆగస్టు 2018న పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో కేసున మోదు చేశారు. ఆత్మ హత్యకు కారణమైన మల్లవ్వను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ హెడ్‌కానిస్టేబుల్ శంకర్ పదిమంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ వేముల లక్ష్మీప్రసాద్ వాదించారు. పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో మల్లవ్వకు ఏడాది జైలు శిక్ష విధించారని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పీపీ లక్ష్మీప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ నవీన్, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌ను ఎస్పీ అభినందించారు.

వివాహిత అదృశ్యం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 18 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపుర ప్రాంతానికి చెందిన తరున్నుమ్ అనే వివాహిత అదృశ్యం అయినట్లు పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తరున్నుమ్ రెండు రోజుల క్రితం ఇంటి బయటకి వెళ్లి తరిగిరాకపోవడంతో భర్త మునావర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వివరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 18 : సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో మురికి కాలువ వద్ద 50 సంవత్సరాలకు పైబడిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. మెరున్‌కలర్ షర్టు, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. చనిపోయిన వ్యక్తి వెంట బ్యాగు ఉందని తెలిపారు. వివరాలు తెలిసిన వారు మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని పేర్కొన్నారు.

కువైట్‌లో జగిత్యాల వాసి మృతి



సాయికృష్ణ గౌడ్ (ఫైల్)

జగిత్యాల క్రైం, సెప్టెం బరు 18 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని కటికవాడకు చెందిన కొత్తకొండ సాయికృష్ణగౌడ్(37) కువైట్‌లో గుండె పోటుతో మృతిచెందాడు. సాయి కృష్ణగౌడ్ ఉపాధి కోసం 10 సంవత్సరాలుగా కువైట్‌లో ఉపాధి పొందుతున్నాడు. రెండు రోజులక్రితం విధులు ముగించుకుని తన రూంకు వచ్చిన సాయికృష్ణ గౌడ్ గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. బుధవారం జగిత్యాలకు సాయి కృష్ణగౌడ్ మృతదేహం చేరుకోగా బంధువులు రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 18: కరీంనగర్ రూరల్ మండలంలో మద్యం, ఆటో, నగదు చోరీ, వాచ్‌మన్‌పై దాడి కేసులో ముగ్గురు నిందితులను కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ బుధవారం అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దొంగతనాల కేసుల్లో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఇందిరానగర్‌కు చెందిన కట్ట హన్సర్ అలియాస్ గడాఫ్(19), నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జమలంకు చెందిన ఇంజపల్లి జగదీశ్వర్(19)లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండ్‌కు జైలుకు తరలించారు. కరీంన గర్ చెందిన మైనర్ బాలుడును కూడా అదుపులోకి తీసుకోగా మరో నిందితుడు దేవదాస్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం ఈ నెల 10న అర్ధరాత్రి ఒంటి గంటకు కరీంనగర్‌రూరల్ మండలంలోని ముగ్ధుంపూర్ వినాయక వైన్స్ వద్ద వాచ్‌మన్ బదుగు అంజయ్యపై దాడి చేశారు. షాపు షట్టర్‌ను పగలగొట్టి అందులో నుంచి 39 వేల రూపాయల విలువగల మద్యాన్ని, క్యాష్ కౌంటర్ నుంచి 28 వేల రూపాయల నగదుతో పాటు వాచ్‌మన్ మొబైల్ ఫోన్లను దొంగిలించారు. మరో సంఘటనలో అదే రోజున దుర్శేడ్ గ్రామానికి చెందిన బలుసుల సంపత్ తన ఆటోను రాత్రి 9 గంటల సమయంలో ఇంటి ముందు పార్కింగ్ చేసి మరుసటి రోజు ఉదయాన్నే చూడగా తన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసు ఠాణాలో కేసు నమోదైంది. ఈ రెండు కేసుల్లో నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు కరీంనగర్‌లోని బొమ్మకల్ బైపాస్ వద్ద మంగళ వారం నిర్వహించిన వాహన తనిఖీల్లో కరీంనగర్ నుంచి అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు ఒక ఆటోలో వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తనిఖీ చేయగా వారివద్ద 55 గ్రాముల గంజాయి పట్టుబడింది. పోలీసుఠాణాకు తరలించిన అనంతరం అనుమానితులను విచారించగా మరో ఇద్దరితో కలిసి మొత్తం నలుగురు దుర్శేడ్‌లో ఆటో దొంగతనం, ముగ్ధుంపూర్ వైన్‌షాపులో చోరీ, వాచ్‌మెన్‌పై దాడి, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లినట్లు వెల్లడించారు. ఇందులో ముగ్గురుపై నిజామాబాద్ పోలీసు ఠాణాలో దొంగతనం కేసు కూడా నమోదైందని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గంభీరావుపేట సెప్టెంబరు 18: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన బరిగెల కిషన్ (40) బుధవారం మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన కిషన్ 45రోజుల క్రితం బైక్‌పై మాచారెడ్డి వెళ్లి తిరిగి వస్తున్నాడు. మాచారెడ్డి, నర్మాల క్యాంపు మార్గ మధ్యలో వాహనం అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన కిషన్‌ను ముందుగా సిరిసిల్ల అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌లో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

వెల్గటూర్, సెప్టెంబరు 18: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ఓ వ్యక్తి గుండె పోటుతో బుధవారం మృతి చెందాడు. గొల్లపల్లి మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన పబ్బ రవీందర్(51)అనే వ్యక్తి బుధవారం పౌర్ణమి కావడంతో దండేపల్లి మండలం గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి దర్శనం చేసుకోవడానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బస్సు ఎక్కిన వ్యక్తి వెల్గటూర్ సమీపంలో హఠాత్తుగా గుండె పోటుకు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే బస్సులో ఉన్న వారు ప్రథమ చికిత్సతో పాటు సీపీఆర్ చేసినా లాభం లేకపోయింది. ప్రయాణికు లు 108కు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది రవీందర్‌ను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాము కలకలం



పామును పట్టుకున్న ఖాసీం

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 18: జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం నాగుపాము కలకలం సృష్టించింది. రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలోకి పాము రావడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు గందరగోళానికి గురయ్యారు. అయితే కార్యాల య సిబ్బంది మల్యాల మండల కేంద్రానికి చెందిన ఖాసీం అనే పాములు పట్టే వ్యక్తికి సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

సిమ్స్ ఎదుట స్వచ్ఛంద సంఘాల ధర్నా

● మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు నిరసన



నిరసన తెలుపుతున్న ఐక్య సంఘాల నాయకులు

కళ్యాణ్‌నగర్, సెప్టెం బరు 18: సింగరేణి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పనిస్థలాల్లో మహిళా ఉద్యోగులపై వేధింపులను నిరసిస్తూ స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఐత శివకుమార్, నాయకుడు మద్దెల దినేష్ మాట్లాడుతూ కళాశాలలో రోజురోజుకు మహిళా ఉద్యోగులపై వేధింపులు పెరుగుతున్నాయని, రెండు నెలలక్రితం ఇదే కళాశాలలో ఓ సూపర్‌వైజర్ పారిశుధ్య విభాగానికి చెందిన ఓ మహిళ ఉద్యోగిపై లైంగిక దాడికి పాల్పడ్డారని, అతనిపై ఇప్పటికీ పోలీస్ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రెండు రోజులక్రితం సెక్యూరిటీ సూపర్‌వైజర్ సెక్యూరిటీ విభాగానికి చెందిన ఓ మహిళను వేధించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని, సూపర్‌వైజర్లు, ప్రిన్సిపాల్ కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. రెండు సంఘటనలు జరిగినా ఇప్పటి వరకు చర్యలు శూన్యమని, రెండు నెలల క్రితం ఓ సూపర్‌వైజర్ మహిళ ఉద్యోగాలను నిర్దాక్షిణ్యంగా తొలగించారని, వారిని ఇప్పటికీ కూడా పనిలోకి తీసుకోలేదన్నారు. స్థానికులకు ఏజెన్సీ ఇవ్వకుండా హైదరాబాద్‌లో ఉండే వారికి ఏజెన్సీలు అప్పజెప్పుతూ ఏజెన్సీ నిర్వాహకుడు డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. మెడికల్ కళాశాలలో పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని, ప్రిన్సిపాల్ కళాశాలలో జరిగే సంఘటనలపై మౌనంగా ఉండడం పలు అనుమానాలకు దారి తీస్తుందన్నారు. ఈ నిరసనలో స్వచ్ఛంద సంఘాల నాయకురాలు గోలివాడ చంద్రకళ, మహిళలు పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 18: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయినుల పోస్టులను మెరిట్ జాబితా ప్రకారం భర్తీ చేసేందుకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను గురువారం పరిశీలించనున్నట్లు డీఈవో రమేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే హెల్ప్ డెస్క్ 9642959599, 9493111179లో సంప్రదించాలని సూచించారు.

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 18: తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ కనకం కుమారస్వామి కోరారు. తహసీల్దార్ ఫారూఖ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా అనేక సంవత్సరాలు పోరాటం చేశామన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రతీ ఉద్యమకారుడికి వెంటనే 250గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఛైర్మన్ బట్టి చంద్రమౌళి, అనంతారం మాజీ సర్పంచ్ చల్ల నారాయణ, ఉద్యమకారులు తెలంగాణ శ్రీను, గోల్కొండ శంకర్, మొబీన్, బొంబాయి రవి, ఆవారు బాలయ్య, కనుక రెడ్డి, బోయ బాలయ్య, తాటిపెల్లి శంకర్, దేవునూరి అంకుష్ పాల్గొన్నారు.

రేపు శ్రీరామ గ్రంథాలయం, కల్యాణ మండపం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 18: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో నారాయణపురం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీరామ గ్రంథాలయం, తిరుమల కల్యాణ మండపం ఈ నెల 20న ప్రారంభించనున్నామని ఆ సంస్థ సభ్యుడు బుధవారం తెలిపారు. ప్రభుత్వ మాజీ సలహాదారు, విశ్రాంత కలెక్టర్ కేవీ రమణాచారి చొరవతో గ్రామంలో కల్యాణ మండపాన్ని నిర్మించామన్నారు. విద్యార్థులు నిరుద్యోగుల కోసం శ్రీరామ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, విశ్రాంత కలెక్టర్ రమణాచారి, సీఎం రేవంత్ రెడ్డి పీఆర్వో శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ హాజరుకానున్నారని తెలిపారు.

కొనసాగుతున్న నీటి విడుదల

బోయినపల్లి, సెప్టెంబరు 18: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి ఇన్ ఫ్లోను నిలిపివేయగా అవుట్ ఫ్లో కొనసాగుతోంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.14 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 25.348 టీఎంసీల మేరకు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 18: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.04 టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు


ఆది శ్రీనివాస్‌ను కలిసిన కనమేని చక్రధర్‌రెడ్డి తదితరులు

ముస్తాబాద్, సెప్టెంబర్ 18 : ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలవడానికి మండల నాయకులు వేములవాడ తరలివెళ్లారు. ఆది శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుండం నర్సయ్య, అంజనేయరావు, కిషన్‌రావు, ఏనుగు వేణు, బండి శ్రీకాంత్, జనగామ శ్రీనివాస్, తోట ధర్మేందర్, మహిపాల్‌యాదవ్, కనమేని శ్రీనివాస్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 18: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులోని అంజనేయస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం, పుష్పార్చన తదితర కార్యక్రమాలను జరిపించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 18: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మారెల్లి నాగరాజు కుటుంబానికి ఆ పార్టీ నాయకులు బుధవారం నగదు, బియ్యం అందజేశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య రూ.5 వేలు, 50 కిలోల బియ్యం, మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ కృష్ణ హరి రూ.5 వేలు, ప్యాక్స్ ఛైర్మన్ రూ.5 వేలు, మాజీ ఉప సర్పంచ్ పాశం దేవ రెడ్డి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ హరి, కృష్ణారెడ్డి, దేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ విప్ జన్మదిన వేడుకలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 18: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను బుధవారం సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో వేడుకలకు ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకుల ఆహ్వానం మేరకు శివ భక్త మార్కండేయ స్వామి ఆయలంలో ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్, టీపీసీసీ సభ్యులు సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, బ్యాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, చేనేత సెల్ పట్టణ అధ్యక్షుడు బాలరాజు, మహి ళా జిల్లా అధ్యక్షురాలు వనిత, పట్టణ అధ్యక్షురాలు స్వరూప, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ప్రమోద్, కౌన్సిలర్ రెడ్యానాయక్, మాజీ కౌన్సిలర్ శ్రీదేవి, చం ద్రకళ, దేవదాస్, పీసీసీ మాజీ కార్యదర్శి నర్సయ్య, పద్మశాలి సంఘం అధ్య క్షుడు వెంకటరమణ, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

● జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో మాజీ టీపీసీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ మారంపెల్లి లక్ష్మీనారాయణ రోగులకు పండ్లు, అల్పాహారం పంపిణీచేశారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు బుధవారం వేములవాడలో ఘనంగా నిర్వహించారు. ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలురక్తదానం చేశారు. ఆర్యవైశ్య వాసవి నిత్య అన్న సత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆది శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. రాజన్న ఆలయ సమీపంలో అన్నదానం నిర్వహించారు. అమెరికాలోని మిచిగాన్ రాష్ట్రంలోని సెంట్రల్ మిచిగాన్ యూనివర్సిటీ విద్యార్థులు వేడుకలు నిర్వహించారు.

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన


సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న ఆది శ్రీనివాస్

శుభాకాంక్షలు తెలుపుతూ లేఖ రాశారు.

వేములవాడ టౌన్: వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో అగ్రహారం జోడాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో విప్ ఆది శ్రీనివాస్ కేక్‌కట్ చేశారు. నాయకులు ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాస్‌రావు, ఎర్రం ఆగయ్య, వనపట్ల ప్రభాకర్‌రెడ్డి, ఇటిక్యాల రాజు, పండుగ ప్రదీప్, కదిరే రాజ్ కుమార్, గాలిపెల్లి స్వామి, ఊరడి రాంరెడ్డి, కత్తి కనుకయ్య, రగుడు పర్శరాములు బోనాల రమేష్, సత్తయ్య, లింగయ్య తదితరులు ఉన్నారు.

వేములవాడ కల్చరల్: వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలో రక్తదానం చేశారు. ఎదురుగట్ల వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోయినేని లహరి కరుణాకర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ రంగు వెంకటేష్‌గౌడ్, రొండిరాజు తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: కోనరావుపేటలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కచ్చకాయల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.


వేములవాడలో..

చందుర్తి: చందుర్తి మండలం సనుగులలో ఆది శ్రీనివాస్ తమ ఇంటి ఇలవేల్పయిన గోవిందరాజుస్వామిని దర్శించుకున్నారు. చందుర్తి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: దుబాయ్‌లో మండల కేంద్రానికి చెందిన అదాన్ కార్ వాష్ కంపెనీ యజమాని బొల్లి కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

రుద్రంగి మండల కేంద్రంలోని లక్ష్మీ నర్సింహస్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. తల్లిదండ్రులు ఆది లక్ష్మీ- గోవింద్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ చైర్మన్ కొమిరె శంకర్ ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, గ్రామ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మీనయ్య, సర్పంచ్ ప్రభలత మనోహర్, గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నారాయణ, నర్సరెడ్డి, తిరుపతి, శంకర్, గంగాధర్, లింగం తదితరులు పాల్గొన్నారు.


అగ్రహారంలో కేక్‌కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


రుద్రంగిలో నర్సింహస్వామిని దర్శించుకుంటున్న ఆది శ్రీనివాస్


దుబాయ్‌లో కేక్ కట్ చేస్తున్న యువకులు

రహదారుల మరమ్మతు పనులు చేపట్టాలి

మల్యాల, సెప్టెంబరు 18: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. దిగువ కొండగట్టులో వినియకుడిని దర్శించుకున్న అనంతరం తక్కళ్లపల్లి శివారులో ఇటీవలి వర్షాలకు దెబ్బతిన రహదారిని పరిశీలించారు. త్వరగా మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదే శించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో అదనపు డార్మిటరీల నిర్మాణానికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం మల్యాల మండల పరిషత్‌లో అధికారులతో సమావేశమయ్యారు. నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, ఆగంతపు వంశీధర్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, మ్యాక లక్ష్మణ్, ముత్యాల నర్సింహ రెడ్డి, శనిగారపు తిరుపతి, తిరుపతిరెడ్డి, హరినాథ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని చిలుకవాగు సైడ్ వాల్ నిర్మాణానికి, అంబేద్కర్ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు కొత్తూరి స్వామి ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గంగాధరలో జరిగిన ఓ కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు అంబేద్కర్ సంఘం నాయకులు తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కోనరావుపేట, సెప్టెంబరు 18: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అన్ని సబ్జెక్టులను బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. అంతకుముందు విద్యాలయ ఆవరణ తరగతి గదులు, సరుకులు నిలువ చేసే గది, కిచెన్, స్టోర్ రూంను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? భోజన సదుపాయం ఎలా ఉందని? తరగతులు ఎలా బోధిస్తున్నారని? అని పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, ప్రిన్సిపాల్ ఆర్ఎస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ తరలింపు

- పట్టించుకోని అధికారులు - గ్రామస్తుల ఆగ్రహం

చందుర్తి, సెప్టెంబరు 18: చందుర్తి మండలంలో అక్రమంగా ఇసుక తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. మండలంలోని మూడపల్లి, మల్యాల, సనుగుల, కట్టలింగంపేట గ్రామాల్లోని చెరువులు, ఒర్రెల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లింగంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం ఇసుక తరలింపు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాడని, అనుమతి రాకముందే మల్యాలలోని తిప్పాయి చెరువు నుంచి ఇసుకను అక్రమంగా తరలించాడని గ్రామస్థులు పేర్కొన్నారు. కొందరు ట్రాక్టర్ యజమానులు ఒక ట్రిప్పుకు అనుమతి తీసుకొని నాలుగు నుంచి ఐదు ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారన్నారని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి, సెప్టెంబరు 18:పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ్ అభియాన్, పోషణ మాసంలో భాగంగా సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. తల్లులు, కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద రెడ్డి, అనిల్ రావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, పద్మ, రేణుక, ఏఎన్ఎం వజ్రమ్మ పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

బోయినపల్లి, సెప్టెంబరు 18: టీబీ వ్యాధిని నిర్మూలించేందుకు బోయినపల్లి మండలం విలాసాగర్ వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీ అలెర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ జిల్లా అధికారి శ్రీనివాస్ మాట్లాడారు. ప్రపంచంలోనే అధిక సంఖ్యలో కేసులు భారత్‌లోనే నమోదవుతున్నాయని, దీని ద్వారా మరణాల సంఖ్య కూడా అధిక సంఖ్యలోనే ఉందని అన్నారు. టీబీ అనే మహమ్మారని ప్రజల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఐదు జిల్లాలను ఎంపిక చేసిందని, అందులో సిరిసిల్ల జిలా ఒకటని అన్నారు. టీబీ బారిన పడి ఆ వ్యాధిని జయించిన వారిని టీబీ చాంపియన్‌గా గుర్తించనున్నట్లు, వారికి శిక్షణ నిర్వహించి వారి ద్వారా వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత తదితరులు ఉన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ఇల్లంతకుంట, సెప్టెంబరు 18: మండలంలోని ముస్కానిపేటలో ఏర్పాటు చేసిన నేత్రవైద్య శిబిరానికి స్పందన లభించింది. కొదురుపాకలోని బచ్చమ్మ, చంద్రమౌళి ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకులు రీట బహదర్‌షా, నైత్రవైద్య నిపుణురాలు బిల్ల అనూష రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గంభీరావుపేట సెప్టెంబరు 18 : గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు రాజేందర్ తండ్రి చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు బుధవారం రాజేందర్‌ను పరామర్శించారు. ఆయన వెంట సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కమ్మరి రాజారాం ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


దుబాయ్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


ముస్తాబాద్‌లో క్షీరాభిషేకం చేస్తున్న చక్రధర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 18: గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై చొరవచూపిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ప్రవాస కార్మిక సంఘాల నాయకులు మంగళవారం రాత్రి దుబాయ్‌లో సంబరాలు చేసుకున్నారు. ఉత్తర తెలంగాణలోని గ్రామాల్లో క్షీరాభిషేకం చేయాలని కోరారు. గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, కార్మికుల సమస్యల అధ్యయనానికి సలహాకమిటీ, ప్రజా భవన్‌లో ప్రవాసీ ప్రజావాణి, గురుకుల విద్యాలయాల్లో ప్రవాస కార్మికుల విద్యార్థులకు సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే సత్యం, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కటుకం రవీందర్, దొనికేని కృష్ణ, రాములు ఉన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ రెషిడెన్సియల్ స్కూళ్ల అడ్మిషన్‌లలో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యంపై హర్షం వ్యక్తం చేశారు. గల్ఫ్ కార్మికులు జనగామ శ్రీనివాస్, తోట ధర్మేందర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పెద్దిగారి శ్రీనివాస్, ఎన్ఆర్ఐ జిల్లా అధ్యక్షులు తోట ధర్మేందర్, మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి, రంజాని నరేశ్, మిరుదొడ్డి దేవయ్య లక్ష్మీకిషన్‌రావు, అంజన్‌రావు, వేణు, ఆగుళ్ల రాజేశం, జనగామ శ్రీనివాస్, షాదుల్‌పాష, మట్ట రాణి, బండి శ్రీకాంత్, జంగ రాజు, మహిపాల్, ఆళ్ల విజయ్, ముచ్చర్ల శ్రీనివాస్, రాఘవేందర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం


సిరిసిల్లలో మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 18 : ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్‌గాంధీపై బీజేపీ ప్రజాప్రతినిధులు, నేతలు తీవ్రమైన వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీపై బీజేపీ నేతల వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ప్రజాప్రతినిధులు, నేతలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శ వెంగళ అశోక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, పట్టణ ప్రధాన కార్యదర్శి కోడం అరుణా, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, కత్తెర దేవదాస్, రాగుల జగన్, పత్తిపాక లక్షిరాజం, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, నాయకులు వెల్మల తిరుపతిరెడ్డి, కాముని నళినీకాంత్, అన్నల్‌దాస్ భాను, గుండ్లపెల్లి గౌతమ్, భీమరం శ్రీనివాస్, కాసర్ల రాజు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం రాజేశ్వరరావు నగర్ కాలనీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ జాతీయ నాయకుడు తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తన్వీందర్ సింగ్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. తన్వీందర్ సింగ్ తీరు నిరసిస్తూ సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారిపై దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి. మాజీ ఎంపీటీసీ పర్శరాములు, కాంగ్రెస్ మండల నాయకులు ఉన్నారు.

కట్టెల పొయ్యితో కష్టాలు

● మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఆవేదన


పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న నిర్వాహకురాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, అల్మాస్‌పూర్, హరిదాస్‌నగర్, పదిర, నారాయణపూర్, బండలింగంపల్లి, గుండారం, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట చేసేందుకు కట్టెల పొయ్యిలపైనా ఆధార పడుతున్నారు. నిర్వాహకులు పాఠశాల ఆవరణలోని చెట్ల కింద వంట చేయాల్సి వస్తోంది. కట్టెల పొయ్యిపై చేయడంతో అటు విద్యార్థులు.. ఇటు వంట నిర్వాహకులు పొగతో ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి స్థాయిలో గ్యాస్ సరఫరా చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని వారు పేర్కొంటున్నారు. కట్టెల పొయ్యిపై వంట చేయడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించాలని, గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని కోరుతున్నారు.